నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 12 జూలై 2024 | HYDERABAD



సుందరయ్య పార్కులో వాకర్స్‌తో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

## పరిశీలించి.. ఆదేశాలిచ్చి..

సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): బాగ్‌లింగంపల్లిలో బల్దియా కమిషనర్ ఆమ్రపాలి గురువారం పర్యటించారు. జోనల్ కమిషనర్ రవి కిరణ్‌తో కలిసి సుందరయ్య పార్కు, మదర్ డైరీ పార్కు, వీఎస్టీ నుంచి బాగ్ లింగంపల్లి వరకు ఫేజ్-2 ఫ్లైఓవర్ ప్రతిపాదిత నిర్మాణ స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. సుందరయ్య పార్కులో వర్షపు నీరు నిల్వడంతో ఇబ్బందులు వస్తున్నాయని, దీంతో పాటు టాయిలెట్ మరమ్మతులు చేపట్టాలని వాకర్స్ కమిషనర్‌ను కోరగా, వెంటనే సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులు కూడా పూర్తి చేయాలని, మదర్ డైరీ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. వీఎస్టీ నుంచి బాగ్‌లింగంపల్లి వరకు రెండు దశల్లో ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలని గతంలో నిర్ణయించగా, మొదటి దశలో ఇందిరా పార్కు నుంచి వీఎస్టీ వరకు చేపట్టిన స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చిందని అధికారులు తెలిపారు.



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

# జిమ్‌లలో స్టెరాయిడ్స్


## కండలు పెంచేందుకు 'మెఫెంటర్మైన్ ఇంజక్షన్లు సరఫరా

### పలు సెంటర్లపై డీసీఏ దాడులు
### ఓ జిమ్ సెంటర్ నిర్వాహకుడి అరెస్టు..
### రూ. 3వేలు విలువైన ఇంజక్షన్లు స్వాధీనం

సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): డబ్బు సంపాదనే లక్ష్యంగా కొందరు జిమ్ నిర్వాహకులు యువకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దేహదారుఢ్యం కోసం వచ్చే వారికి స్టెరాయిడ్‌తో కూడిన రక్తపోటు పెంచే ఇంజక్షన్లు సరఫరా చేస్తున్నారు. వీటిని ఉపయోగిస్తే.. ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావాలు కలుగడమే కాకుండా కొన్ని సార్లు ప్రాణాంతకంగా కూడా మారే అవకాశాలున్నట్లు డీసీఏ అధికారులు హెచ్చరిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని పలు జిమ్ సెంటర్లపై పోలీసులతో డీసీఏ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఓ జిమ్ నిర్వాహకుడిని అరెస్టు చేసి.. అతడి వద్ద నుంచి మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. డీసీఏ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...సికింద్రాబాద్‌లోని తాడ్‌బంద్‌కు చెందిన ఎండీ ఖాసీం స్థానికంగా జిమ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అయితే తన వద్ద జిమ్‌కు వచ్చే వారికి త్వరగా దేహదారుఢ్యం వృద్ధి చెందడానికి నిబంధనలకు విరుద్ధంగా 'మెఫెంటర్మైన్ సల్ఫేట్' ఇంజక్షన్లను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు సికింద్రాబాద్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌సింగ్, మలక్‌పేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ బృందం, మార్కెట్ పోలీసులతో కలిసి గురువారం ఖాసీంకు చెందిన జిమ్‌సెంటర్‌పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఖాసీంను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి రూ.3వేల విలువ చేసే మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు.



అరెస్టయిన నిందితుడు..స్వాధీనం చేసుకున్న ఇంజక్షన్లు



### ఐదేండ్ల జైలు శిక్ష : డీసీఏ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి



దేహదారుఢ్యం కోసం వినియోగించే మెఫెంటర్మైన్ సల్ఫేట్ వంటి ఇంజక్షన్లు తీవ్ర అనారోగ్యానికి దారితీస్తాయి. సాధారణంగా శస్త్రచికిత్సల సమయంలో రక్తపోటును పెంచేందుకు వీటిని రోగికి ఇస్తారు. సర్జరీ చేసే సమయంలో వెన్నుముకకు మత్తు ఇంజక్షన్ ఇచ్చినప్పుడు కొందరిలో రక్తపోటు పడిపోతుంది. అలాంటి సమయంలో రక్తపోటును పెంచేందుకు మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లు ఇస్తారు. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా తగిన మోతాదులో ఈ ఔషధం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇలాంటి ఇంజక్షన్లను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ వర్కౌట్లు చేసి..దేహదారుఢ్యాన్ని పెంచేందుకు ఈ ఔషధాలను విక్రయిస్తున్నారు. దీని వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడటమే కాకుండా కొన్ని సందర్భాల్లో ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలు విక్రయించినా.. నిల్వ చేసినా.. ఐదేండ్ల వరకు జైలు శిక్ష పడవచ్చు.

# 'ఏకో పార్కు' పూర్తి చేయండి..

### పనుల పురోగతిపై మెట్రోపాలిటన్ కమిషనర్ ఆరా

సిటీబ్యూరో, జూలై 11(నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్వాల్‌గూడలోని ఏకో పార్కు నిర్మాణం గత ఏడు నెలలుగా నిలిచిపోయాయి. ఇదే విషయాన్ని మాజీ మంత్రి కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువస్తూ ఎక్స్‌లో ప్రభుత్వ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ హెచ్‌ఎండీఏ చేపట్టిన ప్రాజెక్టులను ప్రత్యక్షంగా సందర్శించారు. పురోగతిలో ఉన్న, ఆగిపోయిన నిర్మాణ ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేస్తున్న నియోపోలిస్ లే అవుట్ పురోగతిని సమీక్షించారు. లే అవుట్‌లోని రోడ్ నం. 4లో రోడ్డును సరి చేయాలన్నారు. కోకాపేటలోని హెచ్‌ఎండీఏ ఓఆర్ఆర్‌పై నిర్మిస్తున్న ట్రంపెట్ ఇంటర్ చేంజ్‌ను పనుల పరిశీలించి పనుల్లో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రైట్ ఆఫ్ వేకు సమీపంలో గ్రీనరీ పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని, ఖాళీ స్థలాలు ఉన్న చోట గ్రీనరీ పెంచేందుకు సన్నాహాలు చేయాలన్నారు. అదే విధంగా హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల అప్ అండ్ డౌన్ స్ట్రీమ్ నాలాలను పరిశీలించి సీసీ కెమెరా, అవుట్ పోస్ట్ సిబ్బంది, చెరువుల సంరక్షణకు తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా చెరువులు, కుంటల్లోకి మురుగు నీరు చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇక ఐటీ కారిడార్, ఓఆర్ఆర్ సమీపంలో ఉన్న హెచ్‌ఎండీఏ పార్కులు, భూములను, రాయదుర్గం, కోకాపేట, కొత్వాల్‌గూడ ఏకో పార్కులో పరిశీలించారు. ఓఆర్ఆర్ వెంబడి పూల మొక్కలను పెంచాలని, దీంతో గ్రీనరీతోపాటు మరింత ఆకర్షణీయంగా ఉంటుందని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట ఎంఆర్‌డీసీఎల్ జాయింట్ ఎండీ గౌతమి, అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

# నేటి నుంచి ఇంటింటా జ్వర సర్వే

### 'సీజినల్' ప్రబలకుండా చర్యలు చేపట్టాలి
### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ) : జూలై 25 నుంచి ఆగస్టు 15 వరకు మెదడు వాపు నిర్మూలన వ్యాక్సిన్ కార్యక్రమం ఉంటుందని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో జపనీస్ ఎన్సెఫలిటీస్(జేఈ) వ్యాక్సిన్‌పై డీఈఓ, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ, వక్ఫ్‌బోర్డ్ అధికారులతో వ్యాధుల కట్టడిపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మదర్సాల్లో మెదడు వాపు(జపనీస్ ఎన్సెఫలిటీస్) వ్యాధి నిర్మూలన టీకా వ్యాక్సిన్ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ప్రతి శుక్రవారం అందరూ డ్రైడే నిర్వహించాలని చెప్పారు. పూలకుండీలు, ఫ్రిడ్జిలు, టైర్లు, కొబ్బరి బోండాలు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. డయేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి విష జ్వరాల బారిన పడకుండా విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ఓఆర్‌ఎస్, జింక్ ప్యాకెట్లు అందించాలని సూచించారు. గురువారం నుంచి ఇంటింటా జ్వర సర్వే జరుగుతున్నదని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకట్ తెలిపారు. అనంతరం డీఈఓ రోహిణి మాట్లాడుతూ.. విద్యార్థులకు, తల్లిదండ్రులకు వ్యాధులపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీ కళ తదితరులు పాల్గొన్నారు.



## డెంగీ కేసుల వివరాలివ్వండి

### ప్రైవేటు దవాఖాన యాజమాన్యాలకు
### జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి ఆదేశం

సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): డెంగీ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు వైద్యాధికారులకు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి ప్రైవేటు దవాఖాన యాజమాన్యాలను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభంతో ప్రస్తుతం నగరంలో అక్కడక్కడ డెంగీ కేసులు నమోదవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు జరుపుతున్నామని, రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అయితే ప్రైవేటు దవాఖానకు వచ్చే డెంగీ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు తెలియ తెలియజేయాలని ఆదేశించారు. సరైన వైద్యపరీక్షలు చేయకుండా డెంగీ పేరుతో రోగులకు అవసరం లేని చికిత్స చేసినా, చికిత్స పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు దండుకున్నా చట్టరీత్యా చర్యలు తప్పవని డాక్టర్ వెంకటి హెచ్చరించారు.

### 'మేము సైతం'..

**జూబ్లీహిల్స్:** డెంగీపై సమరంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించనున్నారు. బల్దియా ఆధ్వర్యంలో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యాన్ని కోరుతూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేసింది. ఈ కమ్యూనిటీ సర్వీస్‌లో 'మేము సైతం'.. అంటూ ముందుకొచ్చే విద్యార్థులు ఈ క్యూ ఆర్ కోడ్‌తో ఈనెల 21 వరకు తమ దరఖాస్తులను పంపవచ్చు.




# సమీకృత మార్కెట్లు ఎక్కడ?

### చిక్కడపల్లి, అమీర్‌పేట, పంజాగుట్టలో పురోగతి లేని మోడల్ మార్కెట్లు

సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ప్రతి పది వేల మంది జనాభాకు ఒక సమీకృత మార్కెట్ ఉండాలన్న లక్ష్యానికి జీహెచ్‌ఎంసీ అధికారులు తూట్లు పొడిచారు. కొత్తవి కాదు కదా..పురోగతిలో ఉన్న పనులను సైతం అటకెక్కించారు. చిక్కడపల్లిలో రూ. 40 కోట్లు, అమీర్‌పేట రూ. 13.20 కోట్లు, పంజాగుట్టలో రూ.6.70 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా, పనులను పక్కన పెట్టారు. నారాయణగూడ ఓల్డ్ మున్సిపల్ వెజిటేబుల్ మార్కెట్ వద్ద రూ. 4 కోట్లతో చివరి దశకు వచ్చిన పనులను సైతం పూర్తి చేయలేకపోతున్నారు. ఫలితంగా స్థానికులు వారాంతపు సంతలపై ఆధారపడాల్సి వస్తున్నది. కమిషనర్ స్పందించి మోడల్ మార్కెట్లపై సమీక్షించి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రత్యేకతలతో మోడల్ మార్కెట్లు

కూరగాయలు, మాంసాహారం ఒకే ప్రదేశంలో లభ్యమయ్యే విధంగా పాత మార్కెట్ స్థలాల్లో నూతనంగా మోడల్ మార్కెట్ల నిర్మాణాలను కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఒకే చోట నిత్యావసర వస్తువులు లభించేలా మార్కెట్ ఉండటంతో పాటు స్థానికులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ మోడల్ మార్కెట్ల నిర్మాణం జరిగింది. దాదాపు రూ. 24కోట్ల ఖర్చు పెట్టి 39 మోడల్ మార్కెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కో మార్కెట్‌లో ప్రశాంతమైన వాతావరణం, వేజిటేబుల్, నాన్‌వెజ్, స్టోర్ వేర్వేరుగా ఉండగా, శాకాహార, మాంసాహార అమ్మకం కేంద్రాలు, తినుబండారాల దుకాణాలు, ఫార్మసీ, ఏటీఎంలు, గ్రాసరీ దుకాణాలు, డ్రై ఫ్రూట్ దుకాణాల ఏర్పాటు జీ+1 నిర్మాణంతో ఏర్పాటైన ఈ మోడల్ మార్కెట్లు స్థానికులకు ఉపయుక్తంగా ఉంటున్నాయి.

# ఆధార్‌లో టెక్నికల్ సమస్యలు.. నిలిచిన రిజిస్ట్రేషన్లు

సిటీబ్యూరో, జూలై 11(నమస్తే తెలంగాణ) : ఆధార్ బయోమెట్రిక్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా నగరంలో పలు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో సేవలకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి బయోమెట్రిక్ అనుసంధానంలో ఇబ్బందులు తలెత్తినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి నెలకొని ఉండటంతో... రిజిస్ట్రేషన్లను గురువారానికి వాయిదా వేసినట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ వర్గాలు తెలిపాయి.





## సీఎంను కలిసిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): రాచకొండ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సుధీర్‌బాబు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా శాంతి భద్రతలను కాపాడుతూ.. ప్రజలకు సేవ చేస్తానని సీపీ సీఎంకు హామీ ఇచ్చారు.



## వర్ష సూచన

సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): గాలి విచ్ఛిన్నతి ప్రభావంతో గురువారం రాత్రి గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. రాత్రి 9గంటల వరకు వెస్ట్ మారేడ్‌పల్లి అత్యధికంగా 1.65, పికెట్‌లో 1.55, మాదాపూర్‌లో 1.48, ఉప్పల్ రాజీవ్‌నగర్‌లో 1.30, కాప్రా, అడ్డగుట్టలో 1.25, బోరబండ, చర్లపల్లి, బాలానగర్‌లోని ఓల్డ్ సుల్తాన్‌నగర్‌లో 1.0సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. గురువారం రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 34.5, కనిష్ఠం 24.5 డిగ్రీలు.. గాలిలో తేమ 72 శాతంగా నమోదైనట్లు తెలిపారు.



గురువారం దుర్గం చెరువు వద్ద ట్రాఫిక్ జామ్